# సాక్షి
# రాజన్న సిరిసిల్ల

బుధవారం । 15 । మార్చి । 2023






### రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను మంగళవారం 10వేల మంది దర్శించుకున్నారు. ఆర్జిత సేవలు ప్రారంభం కావడంతో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు.



### బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: వేములవాడలోని బద్దిపోచమ్మకు భక్తులు బోనాలు చేశారు. దీంతో గుడిప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గరిష్టం/కనిష్టం
36.0/20.0

### వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోత కొనసాగుతుంది. రాత్రిపూట చలితీవ్రత ఉంటుంది.

## న్యూస్‌రీల్

### పక్షం రోజుల్లో సబ్సిడీ ఇవ్వాలి



ఏడీ సాగర్‌కు వినతిపత్రం ఇస్తున్న రమేశ్

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో బతుకమ్మ చీరలు నేసిన కార్మికులకు రావాల్సిన సబ్సిడీ డబ్బులు పక్షం రోజుల్లో ఇవ్వాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలోని చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్‌కు వినతిపత్రం ఇచ్చారు. 2023 సంవత్సరానికి చీరల ఆర్డర్లు ఇస్తున్నారని, ఇప్పటికీ 2020 నుంచి 2022వరకు చీరలు నేసిన కార్మికులకు సబ్సిడీ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. పదిహేను రోజుల్లో సబ్సిడీ రాకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కోడం రమణ, ఎల్లారెడ్డి, దేవదాసు ఉన్నారు.

### విద్యార్థులకు పౌష్టికాహారం అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్

సిరిసిల్లటౌన్: విద్యార్థులకు పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం.మహేశ్ అన్నారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు స్కూల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషన్, హెల్త్‌శాఖలకు చెందిన వారిని ప్రతీమండలానికి నలుగురు చొప్పున ఎంపిక చేసి వారికి జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వగా ఆయన మాట్లాడారు. పరీక్షల వేళలో విద్యార్థులు మానసికంగా ఉల్లాసంగా ఉండాలన్నారు. పిల్లలు మానసికంగా ఎదగడం, పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత, లింగభేదం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.


### బడుల బలోపేతమే లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సర్కారు బడులను బలోపేతం చేస్తూ నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదులు, డైనింగ్‌హాల్‌కు మంగళవారం శంకుస్థాపన చేశారు. రానున్న రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల రూపురేఖలు మార్చడానికి మంత్రి కేటీఆర్ కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఎంపీటీసీ ఇల్లందుల గీతాంజలి, నాయకులు నర్సింహారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

### నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



మాట్లాడుతున్న దొబ్బల ప్రవీణ్

సిరిసిల్లఅర్బన్: నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో టీఎస్‌పీఎస్సీ చెలగాటం ఆడుతోందని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యంతో పేపర్లను లీక్ చేస్తున్నారన్నారు. పేపర్ లీక్ చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్, మహేశ్, మధు, వినయ్, మహేందర్, అజయ్, వెంకటేశ్, రాజు, లక్ష్మణ్ ఉన్నారు.

### 20న తైబజార్ వేలం

సిరిసిల్లకల్చరల్: పురపాలక సంఘం పరిధిలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 20న బహిరంగ వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనే ఆసక్తి గల వారు రూ.3లక్షల డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు రూ.25లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్ జత పరిచి కార్యాలయంలో అందజేయాలన్నారు. అలాగే పశువుల అంగడికి రూ.2లక్షల డీడీ, రూ.5లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్ జత చేయాలని సూచించారు.

# ‘ఉపాధి’ అంతంతే!

- ఉపాధిహామీ పథకం ఉద్యోగుల వేతన కష్టాలు
- ‘ఐకేపీ’తో సమానంగా ఇవ్వాలని డిమాండ్
- పనికి తగిన వేతనాల కోసం పోరాటం

**జిల్లాలో ఈజీఎస్ ఉద్యోగులు ఇలా**

| | |
|---|---|
| ఏపీడీ | 01 |
| ఏపీవో | 09 |
| ఇంజినీర్ కన్సల్టెంట్స్ | 03 |
| జేఈలు | 02 |
| టెక్నికల్ అసిస్టెంట్లు | 30 |
| బేర్‌ఫుట్స్ టెక్నీషియన్స్ | 06 |
| కంప్యూటర్ ఆపరేటర్లు | 16 |
| ఫీల్డ్ అసిస్టెంట్లు | 220 |
| మొత్తం | 287 |



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): పల్లెల్లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తవుతున్నాయంటే అది ఉపాధిహామీ పుణ్యమే. ఇంటి ఎదుట మొక్క నాటడం నుంచి ఇంకుడు గుంత, పశువుల షెడ్లు, కరువు పనులు ఉపాధి హామీ కిందకే వస్తాయి. శ్మశాన వాటికల నిర్మాణంలోనూ ఉపాధిహామీ సిబ్బందే కీలకం. ఉపాధిహామీ పథకంలో వేలాది మంది కూలీలను సమన్వయం చేస్తూ, పనులు కల్పిస్తూ.. అభివృద్ధిలో భాగస్వాములవుతున్న ఉపాధిహామీ ఉద్యోగుల జీవితాలు మారడం లేదనే విమర్శలున్నాయి. ఉపాధిహామీ పథకం ఉద్యోగులు, సిబ్బంది పనికి తగిన వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, సెర్ప్ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించిన నేపథ్యంలో వారితో సమానంగా గ్రామాల్లో పనిచేసే ఉపాధిహామీ ఉద్యోగుల్లోనూ ఆశలు చిగురించాయి. సెర్ప్ ఉద్యోగులకు ప్రకటించినట్లుగానే తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. ఏప్రిల్ నుంచి రెగ్యులర్ చేస్తామనే ప్రకటన రావడం, ఉపాధిహామీ ఉద్యోగులను మరచిపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది.

**ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలోనే**

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చాలామంది జిల్లాలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. కొంత మంది ఇరవై ఏళ్లకు పైగా ఇదే విభాగంలో కొనసాగుతున్నారు. ప్రభుత్వం డీఆర్‌డీఏ, డ్వామాలను విలీనం చేసినా.. ఐకేపీ, ఈజీఎస్‌లను మాత్రం వేర్వేరుగానే పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో పది నుంచి ఇరవై ఐదేళ్లుగా పనిచేస్తున్న వారు వందల్లో ఉన్నారు. మంచి రోజులు వస్తాయని ఎదురుచూస్తున్న వారికి.. కేవలం ఐకేపీకి మాత్రమే పేస్కేల్ తీపి కబురు అందడంతో ఈజీఎస్ ఉద్యోగులు నిరాశకు గురయ్యారు. తక్కువ వేతనాలకు, టీఏ, భత్యాలు లేకుండానే కేవలం కాంట్రాక్టు పద్ధతినే వేతనాలపై పనిచేస్తున్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమకు ఐకేపీ ఉద్యోగుల మాదిరిగానే పరిగణించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**చిన్న జిల్లాల్లో ప్రతిభ ఆధారంగా**

తెలంగాణలో చిన్న జిల్లాల ఏర్పాటు అనంతరం ఐకేపీ, ఈజీఎస్‌లను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారు. రెండు విభాగాలు ఉన్నప్పటికీ జిల్లాస్థాయి అధికారి డీఆర్‌డీవో ఒక్కరే. పల్లె ప్రగతి, క్రీడాప్రాంగణాలు, శ్మశానవాటికల నిర్మాణం, ఫిష్‌పాండ్స్, చెరువులు, ఫీడర్‌చానళ్ల పూడికతీత, అన్నింటికి మించి హరితహారంలో మొక్కలు నాటడం, గ్రామ నర్సరీల నిర్వహణ పనులు ఉపాధిహామీ ఉద్యోగులే చేయిస్తున్నారు. అయితే జిల్లాల ఏర్పాటు అనంతరం ఉద్యోగులకు నిర్వహించిన రాత పరీక్షల ఆధారంగానే పోస్టింగ్‌లు ఇచ్చారు. గ్రామసభల తీర్మాణాలు కాకుండా మండలస్థాయి పనిచేసే వారందరిని పరీక్షల అనంతరమే ఉద్యోగాల్లోకి తీసుకున్నారు.

**ఈజీఎస్, ఐకేపీ రెండు కళ్లలాంటివి**



“ప్రభుత్వానికి ఈజీఎస్, ఐకేపీ శాఖలు రెండు కళ్లలాంటివి. ఐకేపీ ఉద్యోగులకు పేస్కేల్ ఇవ్వడం శుభపరిణామం. వారితో సమానంగా పనిచేస్తున్న ఈజీఎస్ ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించాలి. పేస్కేల్ ఇచ్చి, రెగ్యులర్ చేయాలి. అనేక సంవత్సరాలుగా ఈజీఎస్‌లో తక్కువ వేతనాలకు పనిచేస్తున్నాం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– రమేశ్, ఈజీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

# నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలు
- ఫస్టియర్‌లో 3,941, సెకండియర్‌లో 4,497 మంది విద్యార్థులు
- గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి: డీఐఈవో మోహన్



హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం నుంచి ఈనెల 29వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా 18 కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా పోలీసు భద్రత మొదలుకుని విద్యార్థులకు రవాణాపరంగా ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, పరీక్షల సమయంలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా 144 సెక్షన్ అమలు, విద్యుత్ సరఫరా, వైద్య ఆరోగ్యపరంగా తదితర అంశాలపై ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫస్టియర్‌లో 3,941 మంది విద్యార్థులు బుధవారం జరిగే పరీక్షకు హాజరుకానున్నారు. గురువారం నిర్వహించే సెకండియర్ పరీక్షకు 4,497మంది విద్యార్థులు హాజరవనున్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు గంట ముందుగా చేరుకోవాలని డీఐఈఓ మోహన్ తెలిపారు. ఉదయం 9 గంట నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలో నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యం జరిగినా విద్యార్థులను పరీక్ష కేంద్రానికి అనుమతించే వీలులేదని వివరించారు.

# చట్టాల స్ఫూర్తిని చాటండి

క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లకల్చరల్: మహిళలు, వృద్ధుల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాల స్ఫూర్తిని అర్థం చేసుకుని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ మీటింగ్‌హాల్‌లో సఖి కేంద్రం నిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సఖి పనితీరును ప్రశంసించి, సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. విద్యాసంస్థలు, ఆలయాలు, మసీదులు, పని ప్రదేశాలన్నింటిలో 181 టోల్ ఫ్రీ నంబర్ గురించి ప్రచారం చేయాలన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ వయోవృద్ధుల విషయంలో వారసుల నిర్లక్ష్యాలపై వచ్చే ఫిర్యాదులను ఆర్డీవో నేతృత్వంలోని ట్రిబ్యునల్‌ను ఆశ్రయించేలా అవగాహన కార్యక్రమాలు పెంచాలని, సంబంధిత చట్టాలను అమలు చేసే విషయంలో పోలీస్‌శాఖ పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం వృద్ధుల హెల్ప్‌లైన్ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆర్డీవోలు శ్రీనివాసరావు, పవన్‌కుమార్, డిడబ్ల్యూవో పి.లక్ష్మీరాజం, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావుతో పాటు పలు ప్రభుత్వశాఖల అధికారుల పాల్గొన్నారు.

# తలనీలాల టెండర్ వాయిదా



టెండర్ నిర్వహిస్తున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల తలనీలాలను పోగుచేసుకునే హక్కుకోసం మంగళవారం నిర్వహించిన టెండర్ వాయిదా పడినట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. 2023–25 రెండేళ్ల కోసం నిర్వహించే తలనీలాల సేకరణ హక్కు కోసం స్వామివారి పాటగా రూ.14 కోట్లుగా నిర్ణయించారు. ఇందులో పాల్గొన్న 13 మంది కాంట్రాక్టర్లలో తెనాలికి చెందిన వెంకట సురేశ్ ప్రసాదం అనే కాంట్రాక్టర్ రూ. 8.67 కోట్ల హెచ్చుపాటదారుడిగా రావడంతో వాయిదా వేసినట్లు ప్రకటించారు. తిరిగి నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో హరికిషన్, పర్యవేక్షకులు గోలి శ్రీనివాస్, సిబ్బంది రవీందర్‌రెడ్డి, కూరగాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు రాజన్నహుండీ లెక్కింపు**

రాజన్న హుండీని బుధవారం ఉదయం 8గంటల నుంచి స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం ప్రకటించారు. శివకల్యాణం సందర్భంగా హుండీలన్ని నిండిపోయాయన్నారు. సిబ్బంది సకాలంలో హుండీ లెక్కింపులో పాల్గొనాలను ఆదేశాలు జారీ చేశారు.

### నేటినుంచి ఒంటిపూట బడులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని పాఠశాలలకు బుధవారం నుంచి ఒంటిపూట తరగతులు ప్రారంభం కానున్నాయి. వేసవి నేపథ్యంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని ఉత్తర్వులు వచ్చాయి. ఇటీవల వస్తున్న వివిధ రకాల జబ్బులు, దీనికి తోడు ఎండల తాకిడితో విద్యార్థులను తల్లిదండ్రులు ఇంటిలో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని 13 మండలాల్లో 656 పాఠశాలలుండగా వీటిలో 76,268 మంది విద్యార్థులున్నట్లు అధికారిక గణాంకాలున్నాయి.

# అన్నిరంగాల్లో అతివలదే పైచేయి

- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

సిరిసిల్లటౌన్: మారుతున్న పోటీ ప్రపంచానికి అనుగుణంగా మహిళలు అన్నిరంగాల్లో సత్తాచాటుతున్నారని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక పీఆర్ అతిథిగృహం నుంచి ర్యాలీ నిర్వహించారు. సినారె ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో జిందం కళ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ సర్కారు పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రసూతి సమయంలో మహిళలకు కేసీఆర్ కిట్లు అందించడం, సఖి కేంద్రాల ద్వారా రక్షణ, న్యాయపరమైన సేవలు, ఉపాధిలో 33శాతం రిజర్వేషన్లు అందిస్తున్న ఏకైక సర్కారు బీఆర్‌ఎస్ అని పేర్కొన్నారు. స్వచ్ఛ సిరిసిల్లలో మహిళల భాగస్వామ్యం గొప్పదన్నారు. బాల సాహిత్యంలో విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ కందేపి రాణిప్రసాద్‌ను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# భూపతిరెడ్డి బాటలో పయనిద్దాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు
- లక్ష్మీపూర్‌లో సింగిరెడ్డి భూపతిరెడ్డి స్తూపానికి నివాళి



లక్ష్మీపూర్‌లో నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామశివారులోని సింగిరెడ్డి భూపతిరెడ్డి స్తూపానికి మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో ఘననివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు సింగిరెడ్డి భూపతిరెడ్డి అని కొనియడారు. కామ్రెడ్ భూపతిరెడ్డి 75వ వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు పంతం రవి, మంచికట్ల రమేష్, అర్ష వేణు, సామ నాగరాజు, ప్రవీణ్, లక్ష్మీపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

**అమరవీరుల సంస్మరణ సభ**

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో మంగళవారం అమరవీరుల సంస్మరణసభను సీపీఐ నాయకులు నిర్వహించారు. సీపీఐ జిల్లా నాయకుడు మంద సుదర్శన్ మాట్లాడుతూ తిమ్మాపూర్ మండలం పోలంపెల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తుపాకులు ఎక్కుపెట్టి దోపిడీ పీడనలపై రణభేరి మోగించారన్నారు. అనభేరి ప్రభాకర్‌రావుతో పాటు 12 మందిని నైజాం సర్కారు 1948లో హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లో అతికిరాతకంగా కాల్చి చంపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మల్లన్న, అమీనా బేగం, లక్ష్మి, ఎల్లవ్వ, మల్లేశం, రాజు పాల్గొన్నారు.

# ఇంటికే వెళ్లి భూమి రిజిస్ట్రేషన్

- ఉదారత చాటుకున్న అధికారులు



ఇంటివద్ద రిజిస్ట్రేషన్ చేస్తున్న తహసీల్దార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కదలలేనిస్థితిలో ఉన్న ఓ గిరిజన మహిళకు కంటిచూపు కూడా లేకపోవడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ తమ సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్లి భూమి రిజిస్ట్రేషన్ చేసి ఉదారతను చాటారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన గుగులోతు లాలి తనపేరిట 2.20 ఎకరాలను అదే తండాకు చెందిన కడావత్ బాలుకు విక్రయించారు. లాలి మూడేళ్లుగా మంచానికే పరిమితమవడంతోపాటు కంటి చూపు లేకపోవడంతో భూమికొన్న వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడానికి తహసీల్దార్ ఆఫీస్‌కు వెళ్లలేకపోయింది. విషయాన్ని సర్పంచ్ అజ్మీర రజిత తహసీల్దార్ జయంత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లింది. ఆయన తన సిబ్బందితో మంగళవారం లాలి ఇంటికి వెళ్లి భూమిని గంటలోనే బాలు పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. తన ఇంటికే వచ్చి భూమి రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్ జయంత్ కుమార్‌కు లాలి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# నైపుణ్య శిక్షణ.. భవితకు రక్షణ

- కేజీ టు పీజీ క్యాంపస్‌లో విద్యార్థులకు అవగాహన
- సద్వినియోగం చేసుకుంటున్న 85 మంది విద్యార్థులు



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

గంభీరావుపేట(సిరిసిల్ల): పట్టా చదువు పూర్తయిన తర్వాత విద్యార్థులు నిరుద్యోగులుగా మారకూడదనే ఉద్దేశంతో గంభీరావుపేట కేజీ టు పీజీ క్యాంపస్‌లోని డిగ్రీ కళాశాల విద్యార్థులకు ‘టాస్క్’లో భాగంగా వివిధ రకాల నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్నారు. రూబీకాన్ అసోసియేటెడ్ విత్ బాల్కన్ సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలో డిగ్రీ సెంకడియర్, ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు 85 మందికి జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణనిస్తున్నారు. ఐదు రోజుల పాటు కళాశాలలో నిష్ణాతులైన శిక్షకులతో అవగాహన కల్పిస్తున్నారు.చదువుకు ఆటంకం కలుగకుండా బ్యాంక్ ఆఫ్ అమెరికా సంస్థ ఆధ్వర్యంలో సాయంత్రం పూట ఆన్‌లైన్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకుంటే మేలు**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యానికే ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగ సాధనలో వెనుకబడితే ఎంత చదివినా ప్రయోజనం ఉండదు. డిగ్రీ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఉద్యోగాల వేటలో అనేక ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుంది. అలాంటప్పుడు వారికి నైపుణ్యాలు కలిగి ఉంటే ఉద్యోగం సాధించడం సులభమవుతుంది. డిగ్రీ పూర్తయిన తర్వాత పట్టణాలకు వెళ్లి స్కిల్స్‌పై ట్రైనింగ్ తీసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థుల సమయాన్ని దృష్టిలో పెట్టుకొని వారిలో నైపుణ్యాన్ని ఇప్పటి నుంచే పెంపొందించే విధంగా తరగతులు నిర్వహిస్తున్నారు. చదువు పూర్తికాగానే కళాశాలలో నేర్చుకున్న స్కిల్స్‌తో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది. శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఏకాగ్రతతో నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకున్న వారు అవుతారని కళాశాల నిర్వాహకులు చెబుతున్నారు.

**ఆసక్తి కలుగుతోంది**



భవిష్యత్‌లో ఉద్యోగాలు సాధించడానికి ప్రస్తుతం ఇస్తున్న కోచింగ్ మాకు చాల ఉపయోగపడుతోంది. వారు నేర్పిస్తున్న నైపుణ్యాలపై మాకు ఆసక్తి కలుగుతోంది. క్రమం తప్పకుండా క్లాస్‌లకు హాజరై నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నాం.

– అశ్విని, డిగ్రీ సెకండియర్, గంభీరావుపేట

**నైపుణ్యాలుంటేనే ఉద్యోగాలు**



విద్యార్థులకు నైపుణ్యాలుంటేనే భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందుతారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు ప్రస్తుతం పోటీ ఎక్కువగానే ఉంది. చదువుతో పాటు నైపుణ్యాలుంటేనే మంచి ఉద్యోగాలు పొందడానికి వీలుంటుంది. మంచి నైపుణ్యాలను కలిగిన వారిని గుర్తించి వారికి ప్లేస్‌మెంట్ ఉద్యోగాలు కూడా కల్పిస్తాం.

– షేక్, నాగూర్ అహ్మద్ అలీ (ఎన్‌జీఆర్), ట్రైనర్

**సద్వినియోగం చేసుకోవాలి**



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బంది కలుగకూడదని, ట్రైనింగ్ కోసం మళ్లీ పట్టణ ప్రాంతాలకు వెళ్లి సమయాన్ని వృథా చేసుకోవద్దని, చదువుతో పాటే ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ కల్పించడం జరుగుతోంది. గతంలో కూడా శిక్షణ ఇప్పించాం. దాదాపు 20 మంది వరకు ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నా. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– పిట్ల దాసు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, గంభీరావుపేట

## క్లుప్తంగా

### కుల బహిష్కరణపై జయవరంలో విచారణ

- 11 మందిపై కేసు



విచారణ చేపడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

**వేములవాడరూరల్:** వేములవాడ మండలంలోని జయవరం గ్రామానికి చెందిన సార శ్రీనివాస్‌గౌడ్ అదే గ్రామానికి చెందిన 11 మంది గౌడ కులస్తులు తనను కుల బహిష్కరణ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల గ్రామంలో జరిగిన ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పూజా కార్యక్రమానికి తనను పిలవలేదని చెప్పాడు. ఈ మేరకు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి మంగళవారం గ్రామానికి వెళ్లి, గ్రామస్తులు, కుల పెద్దల మధ్య విచారణ చేపట్టారు. నిందితులు 11 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### లింగంపేటలో వ్యక్తి అదృశ్యం



లక్ష్మీపతి

**చందుర్తి(వేములవాడ):** మండలంలోని లింగంపేటకు చెందిన దర్శనాల లక్ష్మీపతి అదృశ్యమైనట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వడ్రంగి వృతి పని చేసుకొని, జీవించే లక్ష్మీపతి సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు తెలిసినవారి ఇళ్లలో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 87126 56420, 70939 35167 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### ఆలయ ఉద్యోగి ప్రవర్తనపై భక్తుల ఫిర్యాదు

**వేములవాడ:** బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లిన తమతో ఆలయ ఉద్యోగి శివ దురుసుగా ప్రవర్తించాడని భక్తులు ఆరోపించారు. అతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఉద్యోగి వివరణ ఇస్తూ ఈ నెల 12న భక్తుల రద్దీ సమయంలో పురప్రముఖుల బోనాల కారణంగా వారికి అవకాశం కల్పిస్తున్న క్రమంలో భక్తులు గొడవకు దిగారన్నారు. తాను ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదని పేర్కొన్నారు.

### విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

**జగిత్యాలక్రైం:** సారంగాపూర్ మండలంలోని అర్పపల్లికి చెందిన వడ్కాపురం రాములుకు విద్యుత్ చౌర్యం కేసులో రూ.17,244 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు వీరయ్య తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. రాములు 2014లో విద్యుత్ చౌర్యానికి పాల్పడగా మొదటి నేరం కింద రూ.వెయ్యి జరిమానా విధించారు. 2016లో రెండోసారి విద్యుత్ చౌర్యానికి పాల్పడగా విజిలెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. మంగళవారం జగిత్యాల మొదటి అదనపు న్యాయమూర్తి విచారణ జరిపి, రాములు నేరస్తుడని తేల్చారు. ఆయన రూ.17,244 జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు. ఈ కేసులో సాక్షులను విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి ప్రవేశపెట్టారు.

# ఇసుక కొరత.. నిర్మాణాల నిలిపివేత

- అనుమతి లేకుండా ఇసుక తరలింపునకు ఎస్పీ చెక్
- జిల్లాలో నెల రోజులుగా నిలిచిపోయిన నిర్మాణ పనులు



ఈ ఫొటో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నూకలమర్రి హైస్కూల్‌లో నిర్మిస్తున్న డైనింగ్ హాల్‌ది. ఇసుక కొరత కారణంగా నెల రోజులుగా పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వ పనులైనప్పటికీ అధికారులు ఇసుక కోసం ఎలాంటి అనుమతులు ఇవ్వకపోవడంతో ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు నిలిపివేశారు. ఇలా ఇసుక సమస్య ఒక్క వేములవాడ మండలంలోనే కాదు దాదాపు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉంది.



మూలవాగులో ఇసుక

**వేములవాడరూరల్:** జిల్లాలో వ్యాపారులు ఇసుకను బంగారంతో సమానంగా చూస్తారు. జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు తరలిస్తూ కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తుంటారు. నిత్యం సిరిసిల్ల, వేములవాడ మూలవాగు నుంచి వేలాది ట్రిప్పుల ఇసుక ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. కానీ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అఖిల్ మహాజన్ వచ్చీరాగానే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేశారు. పల్లె నుంచి మొదలుకొని ఎక్కడా అనుమతి లేకుండా ఇసుక తరలిపోకుండా ప్రత్యేక దృష్టిసారించారు. దీంతో నెల రోజులుగా ఇసుక కొరతతో నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ పనులకు కూడా అనుమతులు ఇవ్వకపోవడంతో ముందుకు కదలడం లేదు. గృహ యజమానులు నిర్మాణాలు నిలుపుదల చేసుకున్నారు.

**అక్రమదారులకు చెక్**

జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుక తరలించే అక్రమదారులకు చెక్ పడింది. వేములవాడ మూలవాగు, జయవరం, మల్లారం, హన్మాజీపేట, లింగంపల్లి తదితర గ్రామాల నుంచి రోజుకు వందలాది ట్రిప్పుల ఇసుక తరలించేవారు. ప్రస్తుతం పోలీస్ బాస్ హెచ్చరికలతో ఎక్కడా అక్రమ ఇసుక తరలింపు జరగడం లేదు. జిల్లా అధికారులే కొన్ని ప్రాంతాలను గుర్తించి, ఇసుక రీచ్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

#### అనుమతి లేకుండా తరలించొద్దు



వేములవాడ రూరల్ ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం. మూడుసార్లు పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తాం. ప్రభుత్వ అనుమతులు ఉంటేనే ఇసుక తీసుకోవాలి.

– నాగరాజు, ఎస్సై, వేములవాడరూరల్

#### ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తాం



వేములవాడ మండలంలోని మల్లారం ప్రాంతంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తాం. జిల్లా అధికారుల నుంచి 10 రోజుల క్రితమే ఉత్తర్వులు వచ్చాయి. గ్రామ సర్పంచ్, రైతులతో మాట్లాడి, త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– నక్క శ్రీనివాస్, తహసీల్దార్, వేములవాడరూరల్

# బిడ్డలను సాదుడు కష్టమైతంది

- గ్రామస్తుల సాయంతో పెద్ద కూతురికి పెళ్లి
- భర్త చనిపోయిండు.. చిన్నపాపకు పోలియో
- పూసవేర్ల వృత్తే ఆధారం
- కేటీఆర్ సారూ.. దాతలూ.. ఆదుకోండి
- రాజర్ల గొల్లపల్లికి చెందిన నిరుపేద సత్తవ్వ వేడుకోలు



కదల్లేని బిడ్డతో కలిసి సంతలో ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తున్న సత్తవ్వ

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** ఆ నిరుపేద కుటుంబానికి వరుస కష్టాలు.. భర్త పక్షవాతంతో మంచం పట్టి మృతిచెందాడు. చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో దాతలు ఇచ్చిన ఆర్థికసాయంతో దహన సంస్కారాలు పూర్తి చేసింది. ముగ్గురు కూతుళ్లలో చిన్న పాపకు పోలియో. రెండు కాళ్లూ పనిచేయవు. బిడ్డలను పోషించుకోవడానికి ఆ తల్లి పడుతున్న బాధ వర్ణనాతీతం. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజర్ల గొల్లపల్లికి చెందిన పూసవేర్ల నర్సయ్య–సత్తవ్వ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వీరిది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. భర్త చనిపోవడంతో సత్తవ్వ తన మొదటి కూతురుకి దాతలు సాయంతో పెళ్లి చేసింది. రెండో కూతురు రాచర్ల గొల్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. ఏడేళ్ల వయసున్న మూడో పాపకు పోలియో రావడంతో రెండు కాళ్లూ పని చేయడం లేదు. నడవడం, కూర్చోవడం రాదు. ఓవైపు భర్త మరణించడం, మరోవైపు కళ్ల ముందే కూతురు దీనస్థితిని చూసి సత్తవ్వ కుమిలిపోతోంది. పూసవేర్ల వృత్తి చేసుకునే ఆమె పలు సంతలకు ప్లాస్టిక్ వస్తువులు తీసుకెళ్లి, విక్రయిస్తూ పిల్లలను సాదుకుంటోంది. పిల్లలు కూడా తల్లితో వెళ్లి, ప్లాస్టిక్ సామగ్రి విక్రయించడం అందరినీ కదిలిస్తోంది. మంత్రి కేటీఆర్ సారు స్పందించి, పాపకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు వీల్‌చైర్ ఇప్పించాలని సత్తవ్వ వేడుకుంటోంది. అలాగే దాతలు ఆర్థిక సాయం అందించి, తన బిడ్డలను ఆదుకోవాలని కోరుతోంది.

## ‘కేంద్రానివి కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు’



మాట్లాడుతున్న రాములు

**సిరిసిల్లఅర్బన్:** కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆరోపించారు. సిరిసిల్ల పట్టణంలోని కార్మిక భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కార్డులు ఉన్న భవన నిర్మాణ కార్మికులందరికీ లాక్‌డౌన్ సమయంలో వారి ఖాతాల్లో డబ్బులు వేస్తామన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు వేయలేదన్నారు. కార్మిక చట్టాలను సవరించి, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలను పెంచి, అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామల మల్లేశం, పతం రవి, అజ్జ వేణు, నాగరాజు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధ్వంసమైన విగ్రహాల పరిశీలన



గాంధీ విగ్రహాన్ని పరిశీలిస్తున్న సీఐ మొగిలి

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ, నంది విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఒకేరోజు రెండు విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం గ్రామంలో కలకలం రేపింది. సీఐ మొగిలి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ఆయా విగ్రహాలను పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సోమవారం రాత్రి కొందరు కావాలనే విగ్రహాలను ధ్వంసం చేశారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. గాంధీ ప్రతిమకు మరమ్మతు చేయించారు. నంది విగ్రహానికి చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



### పంట రక్షణకు భలే ఐడియా!

**ముస్తాబాద్(సిరిసిల్ల):** కోతుల బెడద అన్నివర్గాల వారిని ఇబ్బందులకు గురిచేస్తోంది. వానరాలు రైతులకు కూడా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాటికి ఎలాగైనా చెక్ పెట్టాలని భావించాడు ముస్తాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు చింతోజు రాజారాం. తన వ్యవసాయ క్షేత్రంలోని మామిడి తోటను కోతుల నుంచి రక్షించుకునేందుకు కొండెంగ దిష్టిబొమ్మను ఏర్పాటు చేశారు. కాపలా ఉన్నట్లుగా దానికి చేతిలో ఓ కర్రను ఉంచారు. దీంతో నెల రోజులుగా ఆ మామిడితోట వైపు కోతులు కన్నెత్తి చూడటం లేదు.

## కోళ్లమద్ది గ్రామంలో అధికారుల పర్యటన



కోళ్లమద్దిలో పర్యటిస్తున్న అధికారులు

**గంభీరావుపేట(సిరిసిల్ల):** స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గంభీరావుపేట మండలంలోని అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వారు కోళ్లమద్ది గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో తిరుగుతూ తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ప్లాస్టిక్ వినియోగం, మరుగుదొడ్ల వాడకం తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా అధికారి సురేష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన నేరెళ్ల బాధితుడు



ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న హరీశ్

**తంగళ్లపల్లి(సిరిసిల్ల):** బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను నేరెళ్ల బాధితుడు కోల హరీశ్ మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. గవర్నర్, రాష్ట్రపతిని కలిసి తమ బాధలు చెప్పుకోవడానికి అవకాశం కల్పించాలని వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు.

### అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

**సారంగాపూర్(జగిత్యాల):** అదనపు వరకట్నం కోసం ఓ వివాహితను వేధిస్తున్న ఆమె భర్త, అత్త, మామ, ఆడబిడ్డలపై సారంగాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన యువతికి ధర్మారం మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన సుంకరి మధుకర్‌తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో యువతి కుటుంబసభ్యులు ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. ఈ క్రమంలో కొంతకాలంగా మధుకర్ అదనపు కట్నం తీసుకురావాలని తన భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మధుకర్‌తోపాటు బాధితురాలి అత్త శారద, మామ ఆదిరెడ్డి, ఆడబిడ్డ శిరిషలపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### చౌరస్తాలను పరిశీలించిన ఎస్పీ



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరిసిల్లక్రైం:** ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం సిరిసిల్లలోని ప్రధాన చౌరస్తాలను పరిశీలించారు. కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, గాంధీ, అంబేడ్కర్ చౌక్ వంటి ప్రాంతాల్లో పర్యటించారు. జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహనకు కలియతిరిగినట్లు స్థానికంగా చర్చ జరిగింది. జిల్లా కేంద్రంతోపాటు ధార్మిక ప్రాంతమైన వేములవాడలోనూ ట్రాఫిక్ అంశాలు, రోడ్ల విస్తరణ వంటి అంశాలపై దృష్టిసారించే అవకాశాలు ఉన్నట్లు పలువురు చర్చించుకున్నారు. స్థానికంగా పలు అంశాలను పోలీసులను అడిగినట్లు సమాచారం. ఎస్పీ వెంట సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై రాజ్‌కుమార్ ఉన్నారు.

### సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి ఆకస్మిక మృతి

**జగిత్యాల క్రైం:** జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న షరాఫ్ రాంసింగ్(49) మంగళవారం జగిత్యాలలోని తన ఇంట్లోనే కుప్పకూలి, మృతిచెందాడు. గత కొంతకాలంగా ఆయన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. రాంసింగ్ మృతికి సబ్ రిజిస్ట్రార్ కిషన్‌నాయక్, డాక్యుమెంట్ రైటర్లు రమేశ్, రామకృష్ణ, దామోదర్‌రెడ్డి, అశోక్, శంకర్‌రావు, మోహన్‌రావు, రాజశేఖర్ సంతాపం వ్యక్తం చేశారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**జగిత్యాలక్రైం:** కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక గంగిరెద్దుల కాలనీలో టేకుమల్ల భూలచ్చయ్య ఇంట్లో నిల్వ ఉంచిన 7 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని మండలంలోని రేషన్ డీలర్ తిరునగిరి వేణుగోపాల్ వద్ద భద్రపర్చినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అంజన్న వెండి ఎన్ని కిలోలు?

- ఆలయంలో ఉన్నదెంత? చోరీలో పోయిందెంత? వివరాలివ్వని ఈవో..
- నేటికీ కొండకు రాని దేవాదాయశాఖ విజిలెన్స్ అధికారులు



చోరీ జరిగిన అంజన్న అంతరాలయం

**కొండగట్టు(చొప్పదండి):** కొండగట్టు శ్రీఆంజనేయ స్వామివారి అంతరాలయంలోకి బీదర్‌కు చెందిన దొంగలు గత నెల 24న చొరబడి వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. ఆలయ ఈవో వెంకటేశ్ రూ.9 లక్షల విలువైన 15 కిలోల వెండి పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇప్పటికే 17 కిలోల ఆభరణాలు పట్టుకున్నారు. అయితే చోరీ జరిగిన సమయంలో ఆలయంలో ఉన్న వెండి 37 కిలోలని అర్చకులు, 100 కిలోల వరకు ఉంటుందని కొందరు అధికారులు తెలిపారు. అసలు ఎంత ఉందన్న విషయమై ఈవోను వివరణ కోరగా తాను కార్యాలయంలో లేనని, హైదరాబాద్‌లో ఉన్నానని, ఎంత పోయిందన్నది ఆఫీస్‌కు వచ్చాక చెబుతానని బదులిచ్చారు. 15 కిలోలకు పైగా వెండి వస్తువులు పోయినట్లు గతంలో ఫిర్యాదు చేశామన్నారు. దొంగతనం జరిగితే ఈవో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు అంజన్న కొండకు దేవాదాయ శాఖ విజిలెన్స్ అధికారులు రాకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

## ప్రేమ విఫలమైందని అబ్బాయి ఆత్మహత్య

**ఎలిగేడు(పెద్దపల్లి):** ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురై మండలకేంద్రానికి చెందిన ఓ అబ్బాయి (19) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి అబ్బాయి తల్లిదండ్రులు, సోదరి నాలుగు నెలలుగా కరీంనగర్‌లో నివసిస్తున్నారు. పది రోజుల క్రితం అబ్బాయి స్వగ్రామం వచ్చి తాత, నానమ్మతో కలిసి ఉంటూ.. కాట్నపల్లిలోని ఓ రైస్‌మిల్‌లో కూలీ పని చేసుకుంటున్నాడు. అతడికి కొంతకాలంగా బంధువుల అమ్మాయితో స్నేహం ఉంది. అది ప్రేమగా భావించిన అబ్బాయి.. అమ్మాయిని అడగగా తిరస్కరించింది. దీంతో మనస్తాపానికి గురై ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## వైఎస్ షర్మిల ధర్నాలో జిల్లా నాయకులు

**ఇల్లంతకుంట(మానకొండూర్):** కాళేశ్వరం అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, మానకొండూర్ ఇన్‌చార్జి దుబ్బ నీరజ, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు గజ్జెల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.